క్లుప్తంగా

భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

ఖమ్మం అర్బన్: తనకు ప్రభుత్వం ఇచ్చిన ఆర్ఓఎఫ్ఆర్ పట్టా, వ్యవసాయ భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్న వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రఘునాథపాలెం మండలం ఈర్లపుడి గ్రామ రెవెన్యూకు చెందిన దొనబండ నివాసి మాళోతు వేణుగోపాల్ తెలిపారు. ఈ విషయమై కలెక్టర్, అటవీ శాఖాధికారులకు విన్నవించామన్నారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని కోరారు.

పెండింగ్ ఉండొద్దు..

రఘునాథపాలెం: రెవెన్యూకు సంబంధించి ఎలాంటి పనులు పెండింగ్‌లో ఉండొద్దని ఖమ్మం ఆర్డీఓ గణేశ్ అన్నారు. శనివారం రఘునాథపాలెం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ధరణికి సంబంధించిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జి.లూథర్‌విల్సన్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని టౌన్–5 రామాలయం సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం ఫీడర్ నుంచి ఉన్న విద్యుత్ లైన్ల క్లియరెన్స్ పనుల నిమిత్తం ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ ప్రభాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో కమాన్ బజార్, వల్లాలవారి వీధి, షాదీఖానా, స్టేషన్ రోడ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగించొద్దు



మాట్లాడుతున్న సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి

కామేపల్లి: వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసే వినాయక మండపాల వద్ద శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సింగరేణి సీఐ (కారేపల్లి, కామేపల్లి మండలాలు) తిరుపతిరెడ్డి హెచ్చరించారు. శనివారం కామేపల్లి పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో అఖిల పక్షాల నాయకులు, యువజన సంఘాల నాయకులు, గణేశ్ మండపాల ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశమైన సందర్భంగా ఆయన మాట్లాడారు. మండపాల ఏర్పాటుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, రాత్రి 9 గంటలకు మైకులు బంద్ చేయాలని, ఎప్పటికప్పుడు జియో ట్యాగ్ ద్వారా నిరంతర పోలీసు పర్యవేక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

తమ్మినేని నివాళి

తిరుమలాయపాలెం: మండలంలోని హైదర్‌సాయిపేటలో సీపీఎం శాఖ సభ్యుడు జంపాల సైదులు ఆకస్మిక మరణం పట్ల సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం శనివారం సైదులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు బషీరుద్దీన్, రమేష్, మండల కార్యదర్శి శ్రీను, మహేందర్, ఆనందరావు, పుసులూరి వీరభద్రం, మట్టా సుధాకర్, కృష్ణారావు, ఇమామ్, దాసరి భద్రయ్య తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

ఎర్రా మరణం తీరని లోటు

ఖమ్మం వన్‌టౌన్: కార్మిక నాయకుడు ఎర్రా నరసింహారావు మరణం పార్టీకి తీరని లోటని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. శనివారం సుందరయ్యనగర్‌లోని ఆయన స్వగృహంలో ఎర్రా నరసింహారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు ఎర్రా శ్రీకాంత్, బుగ్గవీటి సరళ, బండి రమేష్, బండి పద్మ, సంగబత్తుల నవీన్‌రెడ్డి, ఆర్.ప్రకాష్, మెరుగు సత్యనారాయణ, నందిపాటి మనోహర్, మెంతుల శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

ఖమ్మంమయూరిసెంటర్: ఎంపీ నామా నాగేశ్వరరావు సిఫార్సుతో 62 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.24.82 లక్షల విలువైన సీఎం ఆర్ఎఫ్ చెక్కులను శనివారం ఎంపీ క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ నేతలు అందజేశారు. ఈ సందర్భంగా వైరా మార్కెట్ కమిటీ చైర్మన్ బీడీకే రత్నం మాట్లాడుతూ.. గతంలో నామ ముత్తయ్య ట్రస్ట్ ద్వారా ఎంపీ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు మీగడ శ్రీనివాసరావు, వైరా, కొణిజర్ల మండల పార్టీ అధ్యక్షులు బాణాల వెంకటేశ్వరరావు, చిరంజీవి, కొణిజర్ల మండల కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు లాల్ మహ్మద్, పార్టీ సీనియర్ నాయకులు దొడ్డపనేని రామారావు, గోపవరం సొసైటీ అధ్యక్షులు రవి తదితరులు పాల్గొన్నారు.

నవరాత్రోత్సవాలకు సన్నద్ధం..!

వినాయక సందడి షురూ..
- భిన్నమైన ఆకృతుల్లో గణనాథుడి ప్రతిమలు
- చిన్నవి మొదలు.. పెద్ద విగ్రహాల వరకు విక్రయాలు
- సైజుఆనబట్టి ధరలు
- పూలు, పూజా సామగ్రి కొనుగోళ్లతో మార్కెట్లు బిజీబిజీ

సండే స్పెషల్





మట్టి విగ్రహాలను విక్రయిస్తున్న మహిళ

ఖమ్మంగాంధీచౌక్: మార్కెట్‌లో వివిధ అలంకరణలు, ఆకృతుల్లో ఉన్న వినాయకుడి విగ్రహాలు సందడి చేస్తున్నాయి. విఘ్నాలు తొలగించే గణేశుడి ఉత్సవాలంటే ప్రతి ఒక్కరికీ ఆనందమే. ఈ ఉత్సవాలను వైభవంగా జరుపుకోవాలని వీధివీధిన, ఇళ్లల్లో గణనాథుడి విగ్రహాలు ప్రతిష్ఠిస్తున్నారు. భక్తుల అభిరుచులకు అనుగుణంగా మార్కెట్‌లో భిన్నమైన వినాయక విగ్రహాలు లభిస్తుండడంతో విక్రయాలు జోరందుకున్నాయి. కాగా, ప్రభుత్వాలు, పర్యావరణ వేత్తలు, మేధావులు మట్టి విగ్రహాలను వినియోగించాలని విస్తృత ప్రచారం చేస్తుండడంతో ప్రజలు మట్టి గణపతి ప్రతిమలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈనేపథ్యాన కొందరు కలకత్తాలో గంగానది మట్టి, జనపనార, వెదురు, వరిపొట్టు వంటి పదార్థాలతో తయారు చేసిన విగ్రహాలను విక్రయిస్తుండడంతో మరికొందరు హైదరాబాద్, సూర్యాపేట వంటి ప్రాంతాల నుంచి తీసుకొచ్చి విక్రయిస్తున్నారు.

వివిధ సైజుల్లో విగ్రహాలు..

గణపతి ఉత్సవాల పట్ల ప్రజలకు ఉన్న ఉత్సాహాన్ని గుర్తించిన కొందరు వినాయక విగ్రహాలను వ్యాపారంగా మలుచుకున్నారు. ఇందుకు ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన కళాకారులతో వివిధ సైజులు, ఆకృతుల్లో విగ్రహాలను తయారు చేయించి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. చిన్న విగ్రహాల ధరలు రూ.180 మొదలు రూ. 2,500ల వరకు విక్రయిస్తుండగా.. మట్టి విగ్రహాలు చిన్నవి సైజులో ఉన్నవి రూ. 250 మొదలు రూ. 4 వేల వరకు అమ్ముతున్నారు. ఇక ఐదు నుంచి ఎనిమిది అడుగుల వరకు ఉన్న మట్టి విగ్రహాల ధరలు రూ.15 వేలు మొదలు రూ. 30 వేల వరకు విక్రయిస్తున్నారు. వ్యాపార కూడళ్లలో ఎక్కడ చూసినా విగ్రహ విక్రయాలే కొనసాగుతున్నాయి.



పూల దండల తయారీ ఇలా..

పూజలకు సిద్ధం..

మార్కెట్లో విగ్రహాలకు అనుగుణంగా దండల తయారీ, కాషాయ జెండాలు, అలంకరణ వస్తువులు, పూజా సామగ్రి విక్రయాలు, గణనాథుడికి పట్టు వస్త్రాల విక్రయాలు డిమాండ్ బాగా పెరిగింది. అంతేకాక వైటు ప్యాంట్లు, షర్టులు, పంచలు, లాల్చీ, పైజామాలు, టోపీలు, వినాయక టీ షర్టులు, మంచి గుమ్మడి కాయలు వంటి వాటికి విక్రయిస్తుండడంతో మార్కెట్లు బిజీబిజీ అయ్యాయి.

పూజా సామగ్రి కొంటున్నాం..



వినాయక చవితిని ఇంట్లో నిర్వహించుకునేందుకు చిన్న విగ్రహం, ఇతర పూజా సామగ్రిని కొంటున్నాం. నాలుగేళ్లుగా మట్టి విగ్రహాలతోనే పూజలు చేస్తున్నాం. పిల్లల ఉత్సాహం మేరకు వారికి ఇష్టమైన దుస్తులను కూడా కొంటున్నాం.

– తూములూరి లక్ష్మీనరసింహారావు, దాబాలబజార్, ఖమ్మం త్రీటౌన్

భక్తుల అభిరుచులకు అనుగుణంగా..



భక్తుల అభిరుచుల మేరకు ఉత్సవ సామగ్రిని, ఇతర వస్తువులను ప్రత్యేకంగా విక్రయిస్తున్నాం. దుస్తులు, టోపీలు, పైజామాలు, లాల్చీలు వంటివి విక్రయిస్తున్నాం. గణేష్ పూజకు అవసరమైన సామగ్రిని కూడా విక్రయిస్తున్నాం.

– గన్నారపు శబరీనాథ్, శ్రీ శాస్త్రా పూజా స్టోర్, కస్బా బజార్, ఖమ్మం

పెద్ద సంఖ్యలో మండపాలు..



గణేశుడి ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో మండపాలు ఏర్పాటవుతున్నాయి. సంప్రదాయ పద్ధతుల్లో పూజలు నిర్వహించేందుకు అవసరమయ్యే పూలు, పండ్లతో పాటు పట్టు వస్త్రాలను సైతం కొనుగోలు చేస్తున్నారు.

– నందుల సుబ్రహ్మణ్యశర్మ, పూజారి, వరంగల్ క్రాస్ రోడ్, ఖమ్మం

పేదల సంక్షేమమే పరమావధి

- రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్
- లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ



అండర్‌గ్రౌండ్ పైప్‌లైన్ పనులపై సూచనలు చేస్తున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్: అన్నివర్గాల ప్రజల సంక్షేమమే పరమావధిగా రాష్ట్ర ప్రభుత్వం పథకాలను అమలు చేస్తోందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. ఖమ్మం నియోజకవర్గం పరిధిలోని 105మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను శనివారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లు తల్లిదండ్రులకు భారం కాకూడదనే లక్ష్యంతో ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ పథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ విజయ్‌కుమార్, కార్పొరేటర్లు కమర్తపు మురళి, గజ్జెల లక్ష్మి, దొన్వాన్‌సరస్వతి, పాకాలపాటి విజయ, దాదే అమృతమ్మ, ప్రశాంతిలక్ష్మి, సర్పంచ్ మాదంశెట్టి హరిప్రసాద్, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, తహసీల్దార్లు స్వామి, విల్సన్ పాల్గొన్నారు.

త్వరలోనే మరో అద్భుతం..

అన్ని హంగులతో ఆధునీకీకరించిన లకారం ట్యాంక్‌బండ్ వద్ద త్వరలోనే మరో అద్భుతాన్ని ఆవిష్కరించనున్నామని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. లకారం ట్యాంక్ బండ్ వద్ద రూ.10 కోట్లతో నిర్మిస్తున్న అండర్ గ్రౌండ్ పైపులైన్ నిర్మాణ పనులను మంత్రి పరిశీలించి మాట్లాడారు. మురుగు నీరు, వర్షపు నీరు వేర్వేరుగా బయటకు వెళ్లేలా పైపులైన్ నిర్మిస్తున్నట్లు తెలిపారు.

విత్తన గణపతికి పూజలు శుభ పరిణామం..

ఖమ్మంమయూరిసెంటర్: వినాయక చవితి సందర్భంగా గణపతిని విత్తన(అంకుర గణపతి) రూపంలో పూజించడం శుభ పరిణామమని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. పువ్వాడ ఫౌండేషన్ ఆధ్వర్యాన వేప విత్తనాలతో తయారు చేయించిన గణపతి ప్రతిమలను క్యాంపు కార్యాలయంలో మంత్రి పంపిణీ చేసి మాట్లాడారు. కాగా, స్తంబాద్రి ఉత్సవ సమితి ఆధ్వర్యాన మట్టి వినాయక ప్రతిమలను ప్రతిష్ఠించే మండప నిర్వాహకులకు పువ్వాడ ఫౌండేషన్ ఆధ్వర్యాన పోలీస్ అనుమతి, విద్యుత్ వినియోగం చార్జీలు చెల్లిస్తున్నామన్నారు. ఈమేరకు రూ.4 లక్షల చెక్కును విద్యుత్ ఎస్ఈ సురేందర్‌కి అందజేశారు. అనంతరం లకారం ట్యాంక్‌బండ్‌పై ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యాన మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. మేయర్ నీరజ, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్‌తో పాటు గుండాల కృష్ణ, కర్నాటి కృష్ణ, కమర్తపు మురళి, పగడాల నాగరాజు, గెంట్యాల విద్యాసాగర్, కన్నం ప్రసన్నకృష్ణ పాల్గొన్నారు.



విత్తన విగ్రహాలను పంపిణీ చేస్తున్న మంత్రి

స్వార్థ ప్రయోజనాల కోసమే..

ఖమ్మం అర్బన్: కొందరు స్వార్థంతో అభివృద్ధి అడ్డుకునేందుకు తిరుగుతున్నారని, అలాంటి వారిని దూరంగా ఉంచాలని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ కోరారు. ఖమ్మం 12వ డివిజన్ నేతాజీనగర్‌లో చెరుకుమళ్ల వెంకటేశ్వర్లు ఆధ్వర్యాన జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ఖమ్మం నాలుగు దిక్కులా చేసిన అభివృద్ధితోనే భూముల ధరలు పెరిగాయన్నారు. కొత్త బస్టాండ్ సమీపాన రూ.40 కోట్లతో నిర్మిస్తున్న ఆర్టీసీ ఏసీ కన్వెన్షన్ హాల్‌తో ఈ ప్రాంతం వ్యాపారపరంగా మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, మేయర్ నీరజ, కార్పొరేటర్ చిరుమామిళ్ల లక్ష్మీనాగేశ్వరరావుతో పాటు వల్లభనేని రామారావు, చేరుకుమల్ల శ్రీనివాస్, దుద్దుకూరి సత్యనారాయణ, తుమ్మలపల్లి నాగేశ్వరరావు, వీరయ్య బాబు, మోత్కూరి సత్యనారాయణ, గుర్రం భద్రం, దిరిశాల వెంకటేశ్వర్లు, వనమా లక్ష్మణ్‌రావు, రజనీ, భారతి పాల్గొన్నారు.

మంత్రికి వినతి

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని ఉపాధిహామీ పథకం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని టీఎన్జీవోస్ నాయకులు కోరారు. ఈమేరకు జిల్లా అధ్యక్షుడు అఫ్జల్‌హసన్ ఆధ్వర్యాన మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో జి.నరసింహారావు, ఎం.డీ.జలీల్‌ఖాన్, ఎం.శ్రీనివాస్, సత్యనారాయణ, నరసింహారెడ్డి, గీతాంజలి, మోహన్, నీలిమ పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలతో పర్యావరణ హితం



మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

ఖమ్మంమామిళ్లగూడెం/ఖమ్మంగాంధీచౌక్/కామేపల్లి: మట్టి వినాయక విగ్రహాలను వినియోగించి, పర్యావరణాన్ని పరిరక్షించాలని ఉద్దేశంతో పలు స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీల ఆధ్వర్యాన శనివారం గణేశుడి విగ్రహాలను పంపిణీ చేశారు. ఇందులో భాగంగా ఖమ్మం నగరం రోటరీనగర్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ ఉప్పల శారద తన క్యాంపు కార్యాలంలో విగ్రహాలు, గ్రీన్ ఇండియా చాలెంజ్ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యాన సంస్థ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ కేసగాని రాజశేఖర్ సీడ్ గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. అలాగే , కామేపల్లి మండల పరిధిలోని ముచ్చర్ల–జాస్తిపల్లి ఉన్నత పాఠశాలలో ఓజోన్ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు మట్టి విగ్రహాలను అందించారు. ఈ కార్యక్రమాల్లో లీగల్‌సెల్ కోకన్వీనర్ కొలిపాక శ్రీదేవి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు మంద సరస్వతి, ఖమ్మం అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, జిల్లా ఎడ్యుకేషన్ సెల్ చైర్మన్ ఆచంటి కోటేశ్వరావు, డాక్టర్ కేసగాని సుజన గౌడ్, కృష్ణ, వాసు, దూప, దీప నివేదన అర్చక సంఘం రాష్ట్ర ప్రతినిధి ఆమంచి సురేష్ శర్మ, హెచ్ఎం కామేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యాచకులకు చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న బాలు

ఖమ్మం మామిళ్లగూడెం: కాటికాపరి జాంబవంతుడు సొసైటీ ప్రధాన కార్యదర్శి చెరుకుపల్లి బాలు సామాజిక సేవలో భాగంగా 32వ డివిజన్‌లోని నర్తకి థియేటర్ సమీపాన ఉన్న కృష్ణుడి గుడి వద్ద శనివారం యాచకులకు చీరలు, భోజన ప్యాకెట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాలు మాట్లాడుతూ.. శ్మశానవాటికలో శవాలకు అంత్యక్రియలు చేసే తమకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని, దళితబంధు పథకం కింద అర్హులుగా చేర్చి ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పంది వేణు, కొలికపొంగు సైదులు, కె.కాశయ్య, పడిశాల వీరస్వామి, ఏపురి తరుణ్, గట్టికొండ చుక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

'తుమ్మల' కాంగ్రెస్‌లో చేరికతో సంబరాలు

మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా శనివారం కాంగ్రెస్ పార్టీతో పాటు తుమ్మల అనుచరులు, అభిమానులు సంబరాలు చేసుకున్నారు. బాణా సంచాలు కాలుస్తూ.. మిఠాయిలు పంచి పెట్టారు. జై తుమ్మల.. జై కాంగ్రెస్ అంటూ నినాదాలు చేశారు.

నేలకొండపల్లి/ఖమ్మం అర్బన్/కూసుమంచి/ఖమ్మంరూరల్/తిరుమలాయపాలెం/రఘునాథపాలెం



ఖమ్మంరూరల్: బాణా కాల్చి సంబరాలు చేస్తున్న తుమ్మల అనుచరులు, కాంగ్రెస్ నాయకులు

పోషణ మాసోత్సవాలు



ముస్తఫానగర్ సెక్టార్‌లో సీమంతం చేస్తున్న మేయర్ నీరజ, సీడీపీఓ కవిత

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని పలు సెక్టార్ల కింద శనివారం మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యాన పోషణ మాసోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో మేయర్ పునుకొల్లు నీరజ, స్థానిక కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అలాగే ఖమ్మం అర్బన్ ఐసీడీఎస్ సీడీపీఓ బి.కవిత ఆధ్వర్యాన పోషణ మాస కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో భాగంగా సీమంతాలు, అన్నప్రాసనల కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

కబరస్తాన్ లేక తంటాలు

నేలకొండపల్లి: కబరస్తాన్ లేక తల్లిని ఎక్కడ ఖననం చేయాలో తెలియక కుమారుడు పడిన ఆవేదన అందరినీ కన్నీళ్లు పెట్టించింది. నేలకొండపల్లి మండలం రామచంద్రాపురానికి చెందిన మొగలాబీ(78) శనివారం మృతి చెందింది. అయితే, గ్రామంలో ముస్లింలకు కబరస్తాన్ లేకపోవడంతో అంత్యక్రియలు ఎక్కడ జరపాలో తెలియక కుటుంబీకులు కుంగిపోయారు. తల్లి మృతదేహం వద్ద ఉండాల్సిన కుమారుడు నన్నెసాహెబ్ పక్క గ్రామాలైన బోదులబండ, సుర్దేపల్లి వెళ్లి అక్కడి ముస్లింలకు సమస్యను వివరించారు. దీంతో సుర్దేపల్లి కబరస్తాన్‌లో అంత్యక్రియలు నిర్వహించేందుకు అంగీకరించగా, ట్రాక్టర్‌లో తీసుకెళ్లి కార్యక్రమం పూర్తిచేశారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లుకు మద్దతు తెలపాలి



దీక్షలో మాట్లాడుతున్న నాగభూషణం

తిరుమలాయపాలెం: ఎస్సీ వర్గీకరణ బిల్లుకు రాజకీయ పార్టీలు మద్దతు ప్రకటించి తమ చిత్తశుద్ధి చాటుకోవాలని ఎమ్మార్పీఎస్ పాలేరు ఇన్‌చార్జ్ చింతిరాల నాగభూషణం డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో 6వ రోజుకు చేరిన దీక్షలలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చిన బీజేపీ ప్రభుత్వం విస్మరించిందని, ఇకనైనా పార్లమెంట్ సమావేశాల్లో బిల్లును ప్రవేశపెట్టేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ పగిడిపల్లి బాబు, టేకుమట్ల బాబు, వంగూరి వెంకన్న, అజ్మీర భారతి, సుమతి పాల్గొన్నారు.

'ఎస్‌బీఐటీ'లో ఓరియెంటేషన్ ప్రోగ్రాం



మాట్లాడుతున్న కమిషనర్ ఆదర్శ్‌సురభి

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాలలో 2023–27వ బ్యాచ్ విద్యార్థులకు శనివారం ఓరియెంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ.. విద్యార్థులు తమ ఉజ్వల భవిష్యత్‌కు ఈ కళాశాలను ఎంచుకోవటం పట్ల అభినందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా ఉపాధికల్పనా అధికారి కొండపల్లి శ్రీరామ్, ప్రముఖ మోటివేటర్ పి. కృష్ణ చైతన్యరెడ్డి మాట్లాడుతూ.. సమాజంలో చోటుచేసుకుంటున్న అంశాలపై అవగాహన కల్గి ఉండి కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలన్నారు. అనంతరం కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ మాట్లాడుతూ.. కళాశాలలో క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తున్నామన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించగా విద్యార్థులు చేసిన నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి. ధాత్రి, అకాడమిక్ డైరెక్టర్లు గంధం శ్రీనివాసరావు, ఏ.వీ.వీ.శివ ప్రసాద్, జి. ప్రవీణ్ కుమార్, జె.రవీంద్రబాబు, ఎన్. శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ రుణాల మంజూరులో పక్షపాతం

సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధుల ఆరోపణ



సభాప్రాంగణంలో బైఠాయించి నిరసన తెలుపుతున్న ప్రజాప్రతినిధులు

ఖమ్మంరూరల్: ప్రభుత్వం బీసీలకు మంజూరు చేసిన రుణాలను అధికార పార్టీ నేతలు చెప్పిన వారికే ఇచ్చారని ప్రజాప్రతినిధులు అధికారులను నిలదీశారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో అధికారుల తీరుపై ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీసీ రుణాల గురించి ఎంపీఓ మాట్లాడుతుండగా.. తీర్ధాల ఎంపీటీసీ కళ్లెం వెంకటరెడ్డి కల్పించుకొని పార్టీలకతీతంగా అర్హులకు రుణాలు మంజూరు చేయాల్సి ఉండగా పక్షపాతంగా ఎందుకు ఇచ్చారని నిలదీశారు. గ్రామాల్లో అధికార పార్టీ నాయకులు చెప్పిన వారికే రుణాలు ఇచ్చారని మండిపడ్డారు. అనంతరం రైతు రుణమాఫీ గురించి ఏఓ వి. నాగేశ్వరరావు మాట్లాడుతుండగా ఇప్పటి వరకు ఎంతమంది రైతులకు రుణాలు మాఫీ చేశారో స్పష్టత ఇవ్వాలని, చాలా మంది రైతులకు రుణాలు మాఫీ కాలేదని ఎంవెంకటాయపాలెం, తీర్థాల ఎంపీటీసీలు ఏఓను నిలదీశారు. ఏఓ ఏదో చెప్పబోతుండగా ఇంతలో అధికార పార్టీ ప్రజాప్రతినిధులు కల్పించుకొని ప్రభుత్వం రైతులకు ఎక్కడా లేని విధంగా పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. దీంతో విపక్ష, అధికార పక్ష సభ్యులు తీవ్ర వాదోపవాదాలు చేసుకున్నారు. అదే విధంగా ఎంవెంకటాయపాలెం కేంద్రంగా నూతన మండలం ఏర్పాటు చేయాలని కోరుతూ సభ్యులు సభాప్రాంగణంలోనే బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం వివిధ శాఖల అధికారులు తమ నివేదికలను చదివి సభ మమా అనిపించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీఓ రవీందర్‌రెడ్డి, ఎంపీపీ బెల్లం ఉమా, పలు శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారులను గుర్తించాలి

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించి, తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు శ్రీహరి, నాయకులు పొదిలి వెంకటేశ్వర్లు, ఎండీ.ముజాఫర్ తెలిపారు.. శనివారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఉద్యమకారులకు గుర్తింపుకార్డులు, హెల్త్ కార్డులు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, పెన్షన్, బస్సు, రైలు రాయితీ పాస్‌లతో 1969 ఉద్యమకారులుగా గుర్తించాలని, రెండు ఎమ్మెల్సీ, ఒక ఎంపీ సీటు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎవరు తమకు న్యాయం చేస్తారో వారికి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమకారులు కుటుంబసమేతంగా సహకరిస్తామని పేర్కొన్నారు. గత పాలకులు ఎవ్వరూ తమను గుర్తించకుండా మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో కార్యదర్శి వీరభద్రం, గౌరవ అధ్యక్షుడు కుతుంబాక శ్రీనివాసరావు, పసుపులేటి కృష్ణ, రమేష్‌బాబు, ఎం.అప్పారావు, భవానిసింగ్, రామిరెడ్డి, సీహెచ్.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మత్స్య సొసైటీ ఎన్నికల బరిలో 19 మంది..



ఏకగ్రీవంగా ఎన్నికైన రాధాకృష్ణమూర్తి

నేలకొండపల్లి: చెరువుమాధారం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికల బరిలో 19 మంది బరిలో నిలిచారు. జనరల్ కేటగిరిలో 15 మంది, మహిళ కేటగిరిలో నలుగురు ఈ పోటీలో ఉన్నారు. ఈ నెల 22న ఎన్నికలు జరగనుండగా.. 9 డైరెక్టర్ల స్థానాలకు 31 మంది దరఖాస్తు చేసుకున్నారు. శనివారం ఉపసంహరణ నేపథ్యాన 11 మంది ఉపసంహరించుకున్నారు. మంగాపురంతండాకు చెందిన సూర్యా, నాగేశ్వరరావు, రాధాకృష్ణమూర్తిలు ఎస్సీ, ఎస్టీ కేటగిరికి చెందిన డైరెక్టర్ స్థానానికి ముగ్గురు నామినేషన్లు దాఖలు చేశారు. వీరిలో సూర్య, నాగేశ్వరరావు నామినేషన్‌ను ఉపసంహరించుకోవడంతో దీరావత్ రాధాకృష్ణమూర్తి ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. మిగిలిన 19 మందికి ఎన్నికల గుర్తులను కేటాయించారు. ఈ మేరకు రాధాకృష్ణమూర్తిని సన్మానించాక.. గ్రామంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.

విద్యాలయాల్లో వినాయక ఉత్సవాలు



త్రివేణి పాఠశాలలో వినాయక చవితి వేడుకలు

నగరంలోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో వినాయక చవితిని పురస్కరించుకొని ముందస్తుగా వినాయక చవితి వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల విద్యార్థులు మట్టి గణనాథులను తయారు చేయగా.. యాజమాన్యాలు పండగ విశిష్టతను వివరించారు. అంతేకాక ర్యాలీలు నిర్వహించి మట్టి గణనాథులను ప్రతిష్ఠించాలని సూచించారు. – ఖమ్మం సహకారనగర్